సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



ఈఎన్‌సీ సందర్శన

విశాఖ: డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు విభాగానికి చెందిన 16 మంది బృందం శనివారం తూర్పు నావికాదళం కార్యాలయాన్ని సందర్శించింది.



సహస్ర తులసీ దళార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసీ దళార్చన విశేషంగా జరిగింది. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



జెడ్పీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు

విశాఖ: జెడ్పీ సీఈవోగా పనిచేసి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఓఎస్డీగా నియమితుడైన ఎం.పోలినాయుడును జెడ్పీ సిబ్బంది సత్కరించారు.





సుప్రీం చొరవతో ధైర్యం వచ్చింది

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం దేశంలో ఎక్కడా పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఈ విషయంపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసును విచారిస్తూ.. మార్గదర్శకాలకు ఆదేశించడంతో మహిళా వైద్యులకు కొంతమేరకు రక్షణ కల్పించినట్లు అనిపించింది. దోషులను వీలైనంత త్వరగా శిక్షించాలి. రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వర్తించే వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తేనే వారు తమ విధులకు న్యాయం చేయగలరు.

-కె.లావణ్య, ఆయుర్వేద వైద్యురాలు, ఎన్టీఆర్ ఆస్పత్రి, అనకాపల్లి



రాత్రి వేళ భయంగా ఉంటుంది

ఇటీవల కాలంలో జరిగిన సంఘటనలు ప్రసార మాధ్యమాల్లో చూశాక రాత్రి సమయంలో డ్యూటీ అంటేనే భయమేస్తుంది. పీహెచ్‌సీలో రోగులకు ధైర్యంగా వైద్య సేవలు అందించాలంటే మాకు పోలీసు రక్షణ కావాలి. రాత్రి సమయంలోనే కాకుండా పగలు కూడా పోలీసుల పర్యవేక్షణ, గస్తీ వంటివి ఏర్పాటు చేస్తే మాకు ధైర్యం వస్తుంది. ఆస్పత్రుల్లో వసతులు కూడా మెరుగుపడాలి. విశ్రాంతి గదులు తగినంతగా ఉండాలి.

- పి.అనిత, స్టాఫ్ నర్సు, నాతవరం పీహెచ్‌సీ

- అనకాపల్లి/నాతవరం -

న్యూస్‌రీల్

'పాసా' ఆశ్రమం పరిశీలించిన జిల్లా జడ్జి



అణుకులో బాలికను విచారిస్తున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

కోటవురట్ల: విషాహారంతో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనకు సంబంధించి అందుకు కారణమైన పాసా ట్రస్టు ఆశ్రమాన్ని న్యాయమూర్తులు శనివారం పరిశీలించారు. జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య, నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పట్టన్ సియాజ్‌ఖాన్ కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని ఆశ్రమాన్ని సందర్శించి నిర్వాహకుడు పాస్టర్ కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులతోపాటు స్థానికులను విచారించారు. అనుమతులు, ఆహారం, వసతి, బాలికలకు రక్షణ వంటి అంశాలపై విచారణ చేశారు. అక్కడి నుంచి గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి వెళ్లి విషాహారంతో అస్వస్థతకు గురై చికిత్స పొంది కోలుకున్న ఎస్.సావిత్రి అనే బాలికను పరామర్శించారు. ఆశ్రమంలో ఎటువంటి సమస్యలు ఉన్నాయి.. పాస్టర్ కిరణ్‌కుమార్ ప్రవర్తన ఎలా ఉండేది.. తదితర ప్రశ్నలు వేశారు. విచారణలో గుర్తించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య తెలిపారు.

'సినర్జిన్' మృతుడికి రూ.కోటి పరిహారం చెల్లించాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో మరణించిన జార్ఖండ్‌రాష్ట్రానికి చెందిన ఆయాభిన్ కోహ (22) కుటుంబ సభ్యులకు 'ఎసైన్షియా' తరహాలోనే రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సిటు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ముగ్గురికి రూ.50 లక్షల పరిహారాన్ని వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు, ఇతర సామగ్రిని తక్షణమే మార్పు చేసి కొత్త పరికరాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలతో కంపెనీ యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఫార్మా కంపెనీలపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి పెడుతుందని, మిగిలిన సమయంలో కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనకాపల్లి: ప్రతి సోమవారం కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈవారం రద్దు చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పండగను పురస్కరించుకుని ఈ వారం గ్రీవెన్స్ నిర్వహించడం లేదని డీఆర్వో బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ సోమవారం యథావిధిగా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

మరో ఆరుగురు చిన్నారుల డిశ్చార్జ్



డిశ్చార్జ్ అయిన పిల్లలతో డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఆరుగురు పాసా ట్రస్ట్ ఆశ్రమ చిన్నారులు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని పాసా ట్రస్ట్ ఆశ్రమంలో పిల్లలు విషాహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నెల 19న 38 మంది పిల్లలను కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పూర్తిగా కోలుకున్న 26 మందిని శుక్రవారం, ఆరుగురిని శనివారం డిశ్చార్జ్ చేశామని పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మరో నలుగురు ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్నారని వివరించారు.

ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ

సీతమ్మధార (విశాఖ): ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి సర్కిళ్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.







● చేత వెన్నముద్ద.. చెంగల్వ పూదండ..

ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు.. దిద్దరాని మహిమల దేవకీ సుతుడు.. అంటూ అన్నమయ్య శ్రీకృష్ణలీలలను ఎంత హృద్యంగా వర్ణించారో అంతే అందంగా బాలకృష్ణులెందరో ప్రత్యక్షమయ్యారు. మురళి వాయిస్తూ కనువిందు చేశారు. గోపికలతో సయ్యాటలాడారు. వారి ముద్దులొలికే మోములు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యాసంస్థలో రానున్న శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శనివారం విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. బాలవనం నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని పూజించి, వెన్న, మీగడలను నైవేద్యంగా సమర్పించి, ఉట్టి సంబరాల్లో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. కృష్ణ శతక పద్యాలను పఠించి, కృష్ణుని జననం, లీలలను నృత్య గానాలతో ప్రదర్శించి, ఆహూతులను అలరించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని, కళ్లకు కట్టినట్లు వివరించారు.

-పాయకరావుపేట

చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారం

- అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర ఆదేశించారు. అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో బాధితులకు సరైన అంబులెన్స్ సదుపాయం లేక బస్సుల్లో తరలించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఉన్నచోట యాజమాన్యంతో మాట్లాడి ఆస్పత్రులు, అంబులెన్సుల సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుభద్ర అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యంపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు సంబంధిత ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కోటవురట్ల మండలం కైలాసపట్నం సంఘటన, ఫార్మా ప్రమాద సమయంలో బాధితులకు వైద్యులు అందించిన సేవలు ప్రశంసనీయమని కితాబిచ్చారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ గిరిజన ప్రాంతంలో చేయూత పథకం ఇంకా కొందరికి అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని సుభద్ర అన్నారు. అలాగే గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని కూడా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆమె కోరారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని అధికారులు వివరించారు. సమావేశంలో 5వ స్థాయీ సంఘ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం లేని అధికారులు

- ఇద్దరు క్షతగాత్రులకు అందని పరిహారం
- గుర్తించడంలో అధికారులు విఫలం
- తమ తప్పును క్షతగాత్రులపై చూపుతున్న వైనం
- కంపెనీ యాజమాన్యం ఇవ్వమన్నా పరిహారం ఇవ్వని అధికారులు
- ప్రాణభయంతో స్నేహితుడి కారులో నరేష్.. సిబ్బంది కారులో తేజేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లడమే తప్పా?

సాక్షి, అనకాపల్లి: అధికారులకు మానవత్వం లేదు. అచ్యుతాపురం–పరవాడ సెజ్‌లో ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో రియాక్టర్ పేలి ఈనెల 21 జరిగిన ప్రమాదంలో గాయపడిన ఇద్దరు క్షతగాత్రులకు అధికారులు నష్టపరిహారం ఇవ్వలేదు. ప్రమాదం జరిగిన రోజు ప్రాణభయంతో ఒకరిని కంపెనీ సిబ్బంది కారులో.. మరొకరని వారి స్నేహితుడి కారులో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకోవడమే తప్పన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి క్షతగాత్రులదే తప్పన్నట్లు అధికారులు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఒక వైపు కంపెనీ యాజమాన్యం నేరుగా గాయపడ్డ వారిలో వారిద్దరూ ఉన్నారని చెప్పినా.. ససేమిరా అంటూ వినకుండా అధికారులు ఏకపక్షంగా వారికి ఆర్థిక పరిహారం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారు. తేజేశ్వరావు (కెమిస్ట్), నరేష్ (అసిస్టెంట్ మేజేజర్) పరిహారం పొందని బాధితులు. వీరిలో తేజేశ్వరావు ప్రస్తుతం ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంటే.. రెండో క్షతగాత్రుడు నరేష్ ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కంపెనీ సిబ్బంది కారులో ఆస్పత్రికి..

ప్రమాదంలో కెమిస్ట్ తేజేశ్వరరావుకు రెండు కళ్లు దెబ్బతిన్నాయి. రియాక్టర్ పేలి కెమికల్స్ నేరుగా రెండు కళ్లలో పడడంతో 90 శాతం రెటీనా దెబ్బతిన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన రోజు తేజేశ్వరరావును కంపెనీ సిబ్బందే ఒక ఉద్యోగి కారులో ఎల్.వి ప్రసాద్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. అధికారులు నేరుగా కంపెనీ బస్సుల్లో ఆ రోజు ఆస్పత్రిలో చేరిన వారిని గుర్తించారే తప్ప మిగతా వారిని గుర్తించడంలో విఫలం చెందారు. అది కప్పి పుచ్చుకునేందుకు ఇప్పుడు అర్హత ఉన్న క్షతగాత్రులిద్దరికీ నష్టపరిహారం ఇవ్వడంలేదు.

ప్రాణభయంతో స్నేహితుడి కారులో ఆస్పత్రికి..

ప్రస్తుతం ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేష్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ప్రమాదంలో ఒక కన్ను 80 శాతం వరకు దెబ్బతింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ అంబులెన్సులు లేవు. మరోవైపు మృతులను చూసి భయపడ్డ నరేష్ తన స్నేహితుడికి ఫోన్ చేసి రప్పించుకుని కారులో వాసన్ కంటి ఆస్పత్రికి వెళ్లి అక్కడే వైద్యం చేయించుకున్నారు. దీన్ని అధికారులు గుర్తించలేదు. ఇప్పుడు నేరుగా కంపెనీ యాజమాన్యం వీరు మా ఉద్యోగులే.. వారు గాయపడ్డారని నిర్ధారించినప్పటికీ అధికారులు మాత్రం నష్టపరిహారం ఇవ్వడంలేదు.

కేంద్రమంత్రి పరామర్శ



ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాసవర్మ

రాంబిల్లి (యలమంచిలి): ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని శనివారం రాత్రి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం ఆయన అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

సముద్రపు ఇసుక దోపిడీ

- సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘన
- రాత్రి సమయాల్లో తవ్వి టిప్పర్లపై తరలింపు
- మాఫియాకు జనసేన నేతల అండ
- రెండు టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు





పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్లు

నక్కపల్లి: కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. మండలంలో తూర్పుతీరం వెంబడి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఈ కార్యకలాపాలు జోరందుకున్నాయి. ఇసుక తిన్నెల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి పెద్ద పెద్ద టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇలా అక్రమంగా రెండు టిప్పర్లలో సుమారు రూ.1.20 లక్షల విలువ గల 100 టన్నుల ఇసుకను తరలిస్తుండగా శనివారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. రెండు టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు తదుపరి చర్యలు నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా జరుగుతున్న ఇసుక మాఫియా వెనుక స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలతోపాటు, అచ్యుతాపురం మండలానికి చెందిన ఆ పార్టీ కార్యకర్తల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజులుగా మండలంలో గునిపూడి, డీఎల్‌పురం, అమలాపురం తదితర గ్రామాల్లో సముద్ర తీరం వెంబడి ఇసుకను కొంతమంది రాత్రి సమయాల్లో పొక్లెయిన్‌లతో తవ్వకాలు జరిపి సమీప ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. పెద్ద పెద్ద టిప్పర్లలో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో నిర్మిస్తున్న పలు కంపెనీలకు విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించినప్పటికీ.. జనసేన పార్టీకి చెందిన కొంతమంది తీర ప్రాంతాల్లో ఉన్న ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపి కంపెనీలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నక్కపల్లి డిపోలో ఇసుక టన్ను రూ.1225 చొప్పున 40 నుంచి 50 టన్నులు పట్టే పెద్ద టిప్పర్‌తో ఇసుక కొనుగోలు చేస్తే సుమారు రూ.50 వేలు చెల్లించాల్సి వస్తుంది. దీనికి రవాణా చార్జీలు అదనం. దీంతో సముద్రతీరం వెంబడి ఉచితంగా లభించే ఇసుకపై కూటమి నేతల కళ్లుపడ్డాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఇసుకను తవ్వి సమీపంలో ఉన్న కొబ్బరి, మామిడి జీడితోటల్లో నిల్వ చేస్తున్నారు. ఇలా తవ్విన ఇసుకను అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో నిర్మిస్తున్న పెద్ద పెద్ద కంపెనీలకు విక్రయిస్తున్నారు. జేసీబీలను అద్దెకు తీసుకుని తవ్వి లారీల్లో లోడ్ చేస్తున్నారు. గత పదిరోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ బాగోతం శనివారం పోలీసుల దృష్టికి రావడంతో ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వేంపాడు సమీపంలో ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నారు. డీఎల్‌పురం సముద్రతీరం నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.

తీర ప్రాంతానికి ముప్పు

తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో సముద్రపు ఇసుకను తవ్వి తరలించుకుపోవడం వల్ల తీర ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని పలువురు మత్స్యకారులు, నివాస ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపానులు, వరదలు వచ్చిన సమయంలో సముద్రపు అలలు ఎగిసి పడి సమీపంలో ఉన్న గ్రామాలను ముంచెత్తకుండా ఇసుక తిన్నెలు రక్షణ కల్పిస్తాయని, అటువంటి తిన్నెలను ఇష్టానుసారం తవ్వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తీరంలోనే కాకుండా సమీపంలో ఉన్న పొలాల్లో కూడా ఇసుక తవ్వకాలు జరిపి తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్వాసితుల పునరావాసం కోసం స్థల పరిశీలన

- వీసీఐసీ కారిడార్ భూముల్లో కలెక్టర్ పర్యటన
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం



ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి గురించి చర్చిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి



ఏపీఐఐసీ సేకరించిన భూములను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి శనివారం నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను పరిశీలించారు. కాగిత, అమలాపురం, డీఎల్‌పురం గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించింది. విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడం, నిర్వాసితులకు పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో నెల రోజుల నుంచి జిల్లా యంత్రాంగం, ఏపీఐఐసీ అధికారులు నక్కపల్లి క్లస్టర్‌లో సేకరించిన భూములపైనే దృష్టి సారించారు. అమలాపురం, పాటిమీద గ్రామాలను ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఖాళీ చేయించే పరిస్థితి ఉంది. ఈ గ్రామాల వారికి వేరొక చోట పునరావాసం కల్పించారు. గత ప్రభుత్వంలో కాగితలో సర్వే నెంబరు 223లో సుమారు 60 ఎకరాల డీఫారం భూములను సిద్ధం చేశారు. దీంతో పాటు పక్కనే ఉన్న కొంత ప్రభుత్వ భూమిని కూడా సిద్ధం చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఈ భూముల పక్కనే చెరువు ఉండటంతో వర్షాలు పడిన సమయంలో నీరంతా ఈ భూముల్లోకి వెళ్తుందని, ప్రత్యామ్నాయంగా వేరొక చోట తమకు పునరావాసం కల్పించాలని నిర్వాసితులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరి వినతి మేరకు కాగితలో సర్వే నెంబరు 181లో ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలిస్తున్నారు. వీటి స్థితిగతులు, పునరావాసానికి అనుకూలమా కాదా అనేది తెలుసుకునేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు శనివారం ఈ ప్రాంత పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. అయితే వర్షం పడటం, అధికారులు సూచించిన ప్రత్యామ్నాయ భూముల వద్దకు వెళ్లేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో సదరు భూములను విలేజ్ మ్యాప్ ద్వారా దూరం నుంచే పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి కాగిత మీదుగా ఏపీఐఐసీ భూముల వరకు కనెక్టవిటీ రోడ్డు నిర్మాణం విషయంపై స్థానిక రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.60 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదిరి రెండేళ్లు గడుస్తున్నా ఈ వ్యవహారం కొలిక్కి తీసుకు రాలేదని రైతులు చెప్పారు. భూములు ఇచ్చిన రైతులతో సమావేశం నిర్వహించి, మార్కెట్ రేటు ప్రకారం ధర నిర్ణయించి వ్యవహారం కొలిక్కితీసుకురావాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కోరారు. అనంతరం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం కేటాయించిన రెండు వేల ఎకరాల భూములను, వాటి సరిహద్దులను పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపులకు సంబంధించి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేడ్కర్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన



ఆర్మీ ర్యాలీ కోసం చకచక ఏర్పాట్లు

మహారాణిపేట (విశాఖ): ఈ నెల 25న అర్ధరాత్రి నుంచి ప్రారంభంకానున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ శనివారం పరిశీలించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. డైమండ్ జూబ్లీ స్టేడియంలో మెయిన్ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను గమనించారు. ట్రాక్ పునరుద్ధరణ, బారికేడింగ్, లైట్లు, టెంట్లు, క్యూలైన్లు సునిశితంగా పరిశీలించారు. అధికారులు, ఇతర సిబ్బంది ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న వసతి కేంద్రాన్ని, ఎంపిక సమయంలో కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కౌంటర్లను చూశారు. ర్యాలీ ప్రారంభం నాటికి పనుల్లో పెండింగ్ లేకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియకు వచ్చే వారికి ముందస్తు సమాచారం అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, వైద్య విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, ర్యాలీని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

ఇంటి నిర్మాణం కోసం దాచిన నగదు దోచుకెళ్లారు...

- వడ్డాది ఎస్సీ కాలనీలో చోరీ

బుచ్చెయ్యపేట : వడ్డాది ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన కోరుకొండ నాగరాజు నిరు పేద కుటుంబం . కూలి పనులు చేసుకుంటూ తల్లి,తమ్ముడితో కలిసి తాటాకు గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఇల్లు కట్టుకుందామని కష్టపడి సంపాదించిన నగదు రూ.70 వేలు ఇంట్లో దాచుకోగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నగదును అపహరించారు. ఉదయం లేచి చూడగా ఇంట్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, పెట్టెలో దాచుకున్న నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. కష్టపడి దాచుకున్న డబ్బులు పోవడంతో బాధితులు భోరున విలపిస్తున్నారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఎసైన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీఐ బృందం



ఎసైన్షియా ఫార్మా పరిశ్రమపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీ నాయకులు

రాంబిల్లి (యలమంచిలి): ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ కంపెనీలో యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే 17 మంది ప్రాణాలు కోల్పోయారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యాజమాన్యంపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన ఇతర సీపీఐ నేతలతో కలిసి శనివారం ఎసైన్షియా ఫార్మా సంస్థలో ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యంతో లాలూచీ పడిన అధికారుల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఇవి ముమ్మాటికీ హత్యలేనని అన్నారు. ఎసైన్షియా యాజమాన్యం ఎక్కడుందో ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. యాజమాన్యంపై 302 చట్టం ప్రకారం చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి ప్రసాద్, అనకాపల్లి, విశాఖ జిల్లాల కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల తదితరులు ఉన్నారు.

'అసత్య ప్రచారాలు నమ్మొద్దు'

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన ఆ హబ్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దని హబ్ సీఈఓ రవి ఈశ్వరపు ఓ ప్రకటనలో తెలిపారు. అతితక్కువ కాలంలో దేశంలోని ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలకు దీటుగా అత్యుత్తమ ప్రగతి సాధిస్తున్న ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌పై కొంత మంది ఉద్దేశపూర్వకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



విధుల్లో ఉండే మహిళా వైద్య సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన శిక్షలను అమలు చేసేందుకు ప్రభుత్వం చట్టాలను చేయాలి. దాడుల వల్ల వైద్య సిబ్బందిలో భయం వ్యక్తం అవుతుంది. రాత్రి సమయాల్లో విధుల్లో ఉండే వైద్య సిబ్బందిపై రోగుల బంధువులు దుర్భాషలాడుతున్న సందర్భాలు పలు చోట్ల జరుగుతున్నాయి. చట్టాలను కఠిన తరం చేసినప్పుడు వైద్య సిబ్బంది మరింత స్వేచ్ఛగా వైద్య సేవలు అందించగలరు.

–డాక్టర్.శైలజ, పీహెచ్‌సీ వైద్యాధికారి, లంకవానిపాలెం, కె.కోటపాడు మండలం



విధుల్లో వైద్య సిబ్బందికి రక్షణ అవసరం



కోల్‌కతా ట్రైనీ డాక్టరుకు జరిగిన సంఘటన తలుచుకుంటే భయమేస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ముందుగా చర్యలు చేపట్టాలి. గతంలో నాతవరం పీహెచ్‌సీలో కూడా రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా స్టాఫ్ నర్సుపై ఓ వ్యక్తి పూటుగా మద్యం సేవించి వచ్చి అలబడి సృష్టించాడు. వెంటనే మా సిబ్బంది అలర్ట్ కావడంతో సమస్య తప్పింది. వైద్యాధికారులు, సిబ్బందికి రక్షణ అవసరం.

– ఎస్.ప్రసన్న, వైద్యాధికారి నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతోనే ప్రభుత్వంలో కదలిక

- ఫార్మా కంపెనీ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి
- క్షతగాత్రులకు ఇచ్చిన హామీలో భాగంగా పరిహారం అందించాలి
- ఫార్మాలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : అచ్యుతాపురం మండలం సెజ్ ప్రమాద బాధితులకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. సెజ్‌లో జరిగిన ప్రమాదంలో 17మంది తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. అలాగే పదుల సంఖ్యలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ అచ్యుతాపురంలోని ఫార్మాలో జరిగిన ప్రమాదం బాధాకరమన్నారు. ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రమాదానికి కారణమైన కంపెనీపై ఇంతవరకు ఎటువంటి చర్యలు కాగా తీసుకోలేదన్నారు. మృతిచెందిన కుటుంబాలకు న్యాయం జరిగిందంటే జగన్‌మోహన్‌రెడ్డి చలవేనన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన తెలిసి ఆగమేఘాలపై ప్రభుత్వం పరిహారం ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో గోపాలపట్నం వద్ద పాలిమర్స్‌లో జరిగిన ప్రమాదానికి తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఇటీవల ఫార్మాలో జరిగిన ప్రమాదంలో భాగంగా క్షతగాత్రులకు ఇంతవరకు నయాపైసా అందలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు మేజర్ క్షతగాత్రులకు రూ.50లక్షలు, మైనర్ బాధితులకు రూ.25 లక్షల వంతున పరిహారం అందించేలా చూడాలన్నారు. ఇటువంటి ప్రమాదకర సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించేలా తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు దాసరి అప్పారావు, ఇల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరు నెలలకోసారి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

- కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించకుండా చంద్రబాబు హయాంలో జీవో 62 విడుదల
- పరిశ్రమల్లో భద్రతా చర్యలకు కార్మిక సంఘాల డిమాండ్



ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో క్షతగాత్రునితో మాట్లాడుతున్న నర్సింగరావు, ఓబులేసు

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమలకు వేగవంతంగా అనుమతులు మంజూరు చేస్తుందని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మరిచిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా అన్నారు. స్థానిక ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో రాంబిల్లి ప్రమాదంలో క్షతగాత్రులను శనివారం పరామర్శించి, విలేకరులతో వారు మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్లు నిర్వహించకుండా జీవో నంబర్ 62ను విడుదల చేశారని, దీంతో పరిశ్రమల తనిఖీ అధికారులు, కార్మికశాఖ అధికారులు కంపెనీలు తనిఖీలు చేయడం లేదన్నారు. రాంబిల్లి ఎసైన్షియ ఫార్మా కంపెనీలో సేఫ్టీ అధికారి లేడని ప్రాథమిక విచారణలో తెలిపారని, ఈ ప్రమాదంలో యాజమాన్య నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని అన్నారు. పరిశ్రమల్లో ప్రతి ఆరు నెలలకి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, అచ్యుతాపురంలో ఈఎస్‌ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లయ్య, ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆర్.దొరబాబు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

- చదవకపోతే బోధించలేరు
- బోధనలో వైవిధ్యం లోపిస్తోంది
- ఆర్‌జేడీ బి.విజయ్‌భాస్కర్



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

యలమంచిలి రూరల్ : ఉపాధ్యాయుల్లో ఎక్కువ మంది డీఎస్సీలో పోస్టు సాధించడానికి నిరంతరం కష్టపడి చదివేవారని, ఉద్యోగం వచ్చాక చదవడం మానేస్తున్నారని, దీనివల్ల వారి బోధనలో వైవిధ్యం లోపిస్తోందని పాఠశాల విద్య ఆర్‌జేడీ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. పద్యభాగం, గద్యభాగం ఒకే తరహాలో బోధించడం వల్ల విద్యార్థులకు ఆసక్తి కలగడం లేదన్నారు. ఉపాధ్యాయులు ఎన్ని పీజీలు పూర్తి చేసినా, ఎంత అనుభవం ఉన్నా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించలేకపోతే అవన్నీ వృథాయేనన్నారు. శనివారం యలమంచిలి సెయింట్ మేరీస్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ (ఎల్‌ఎస్‌ఆర్‌డబ్ల్యూ)పై ఉపాధ్యాయులంతా దృష్టి పెట్టాలని, వినడం, మాట్లాడడంపై విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచితే చదవడం, రాయడంలో ప్రతిభ వస్తుందన్నారు. బోధనపై నిత్యం కసరత్తు చేయకపోతే ఉపాధ్యాయుడిలో వృత్తి నైపుణ్యం తగ్గిపోతుందన్నారు. తరగతి గది అనేది కేవలం విద్యార్థులకు పుస్తకాల్లో ఉన్న సిలబస్ మాత్రమే చెప్పడానికి పరిమితం కాకూడదని, విద్యార్థుల ప్రవర్తన సన్మార్గంలో పెట్టి వాళ్లకి జీవితంలో ఎలా నడుచుకోవాలో మార్గదర్శనం చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, ఎంఈవో మీనాక్షి, విశ్వేశ్వరరావు, సూర్య ప్రకాష్, జిల్లా పధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎ.వి.హెచ్ శాస్త్రి, శ్రీరామ్మూర్తి, సాయిబాబు, కర్రి రామలక్ష్మి, బొడ్డేడ సత్యనారాయణ, రత్నరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ

- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు
- టీడీపీ వర్గాల దాడిలో గాయపడ్డ బాధితుడికి రూ.50 వేలు అందజేత



దాడిలో గాయపడిన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం : పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ నాయకుల ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. ఈ దాడిలో కొండ్ర కనకారావు గాయపడ్డారన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు స్థానిక నాయకులు అండగా నిలవాలని చెప్పారని, ఈ మేరకు గాయపడిన కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారన్నారు. బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలు, వైబోయిన సత్యనారాయణ, నాగంబోయిన శ్రీనివాసరావు, వియ్యపు పోతురాజు, చొప్పా రాజు, వియ్యపు రమణ, యూత్ అధ్యక్షుడు వెంకటరాజు, వియ్యపు సింహాద్రి, పొలుమూరి అప్పలరాజు, సకురు రమణ పాల్గొన్నారు.

సబ్సిడీపై చెరకు పంటకు పురుగు మందులు



చోడవరం సీడీసీ కార్యాలయంలో చెరకు రైతులకు సబ్సిడీపై పురుగు మందులు పంపిణీ చేస్తున్న సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు

చోడవరం : చెరకు పంట సస్య రక్షణకు అవసరమైన పురుగు మందులు అందుబాటులో ఉంచామని చోడవరం చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ (సీడీసీ) సుంకర శ్రీనివాసరావు చెప్పారు. కలుపు మొక్కల నివారణ మందులను చెరకు రైతులకు శనివారం ఆయన పంపిణీ చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉన్న సీడీసీ ద్వారా చెరకు రైతులకు వ్యవసాయ పనులకు మేలు చేసే అన్ని రకాల పురుగు మందులు అందుబాటులో ఉంచామన్నారు. చెరకులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని చెప్పారు. తెగుళ్ల నివారణకు అవసరమైన మందులు సబ్సిడీపై సీడీసీ ద్వారా రైతులకు అందిస్తున్నామన్నారు. గడ్డిమందులు రెండు రకాలు, 100గ్రాములు ప్యాకెట్ సబ్సిడీపై రూ. 96, 500 గ్రాముల ప్యాకెట్ రూ. 122కే అందిస్తున్నామన్నారు. గమేషన్ 5కేజీల ప్యాకెట్ రూ.101, మోనో క్రిమిసంహారక మందు 250 మిల్లీలీటర్లు రూ. 96కి ఇస్తున్నామన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులైన చెరకు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ శ్రీనివాసరావు కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు



చౌడువాడలో ఇసుకతో పట్టుబడ్డ లారీ

కోటవురట్ల: గొట్టివాడ సమీపంలో వరాహనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వరాహనది నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతోందన్న సమాచారంతో శనివారం తెల్లవారు జామున దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి లేకపోవడంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కె.కోటపాడు : చౌడువాడ శారదానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని కె.కోటపాడు పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను లారీపై తరలిస్తుండగా చౌడువాడ కూడలి వద్ద పట్టుకున్నట్టు ఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపారు. లారీపై కేసును నమోదు చేశామని, పట్టుబడ్డ లారీకి మైన్స్ అధికారులు రూ.25వేల ఫైన్‌ను విధించారని తెలిపారు.

వైరల్ జ్వరాల వ్యాప్తిని అరికట్టాలి

కశింకోట : మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర జోనల్ మలేరియా అధికారి ఎం. కాంతిప్రభ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీని సందర్శించి అక్కడి ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు వృద్ధి నివారణకు నీరు నిల్వ ఉండకుండా ఇళ్లలో ప్రతి వారం డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. అనంతరం జి. సింగవరం గ్రామాన్ని సందర్శించి మలేరియా జ్వర బాధితురాలని పరామర్శించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో విశాఖ జోనల్ మలేరియా ఆఫీస్ విస్తరణాధికారి బి. తిరుపతిరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ. సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్.కె.జి నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

28న లక్ష్మీగణపతి హోమం

అనకాపల్లి: మండలంలో బట్లపూడి పంచాయతీ రాయుడుపేట సోహం ఆశ్రమంలో ఈ నెల 28న ఉదయం 7 గంటల నుంచి లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకుడు కాండ్రేగుల రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఆశ్రమంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. హోమాన్ని ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని వజ్రాలంకరణ, వివిధ రకాల పూల మాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు విష్ణు సహస్ర నామార్చన, భక్తుల నామాలతో పూజలు చేశారు. అధికంగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కశింకోటలో మోస్తరు వర్షం

కశింకోట: మండలంలో శనివారం మోస్తరుగా వర్షం కురిసింది. దట్టమైన మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా ఉదయం వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. కొద్ది రోజులుగా తీవ్ర ఎండలతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షం ఖరీఫ్ వరి పంటకు, నాట్లు వేయడానికి ఉపకరిస్తుందని తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణ చిత్తడిగా మారింది. దీంతో స్టేషన్‌లోకి రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



వేషధారణలో చిన్నారులు

కశింకోట: తాళ్లపాలెం గాయిత్రీ స్కూల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 107 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,590	4,990
రెండో రకం	--	--
మూడోరకం	3,200	3,300

అనకాపల్లి సినిమాలు

పాగల్ v/r కాదల్	: రాజా(మార్నింగ్, మాట్నీ)
త్రిల్లర్ అండ్ చిల్స్	: రాజా(ఫస్ట్‌షో, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
మారుతీనగర్ సుబ్రమణ్యం	: షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
11 డిమోంటి కాలనీ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 376 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



వైద్య సేవలు చేయాలంటే భయమేస్తోంది

ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేనప్పుడు మాలాంటి వారికి భద్రతపై భరోసా లేదనిపిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించాలంటే భయమేస్తోంది. కరోనా కష్టకాలంలోనూ వైద్యులు ఎందరివో ప్రాణాలు కాపాడారు. అలాంటి వైద్యుల ప్రాణాలపై కర్కశత్వం చూపించిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం మహిళా వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించే విధంగా చట్టాలు చేయాలి.

– పులిజాల సుగుణమాల, ఏఎన్ఎం రేబాక సచివాలయం



ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి



వైద్యులు, నర్సులకు ప్రత్యేక చట్టం చేస్తామని కేంద్ర ప్రకటించినప్పటికీ అమలు చేయలేదు. కోల్‌కత్తా వైద్యురాలు హత్య ఘటనలు జరగకుండా ఉండాలంటే ఇటువంటి చట్టం అవసరం. బాలబాలికలకు విద్యార్థి దశనుంచి నైతికలు విలువలతో కూడిన విద్యను అందించాలి. ఆస్పత్రిల్లో రక్షణ పెంచాలి. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు జాప్యం చేయకుండా తక్షణమే నిందితులను శిక్షించే చర్యలు చేపట్టాలి.

– యశోద, పీహెచ్‌సీ వైద్యురాలు, కశింకోట

ఈ -క్రాప్.. రైతు సేఫ్

- ప్రతి పంటకు నమోదు తప్పనిసరి
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వస్తే పరిహారం
- బ్యాంకు రుణాలతోపాటు బహుళ ప్రయోజనాలు
- ఇంత వరకూ 40 శాతం ఈ -పంట నమోదు

ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీవ్రంగా నష్టపోయిన పంటలకు పరిహారం పొందాలన్నా, బ్యాంకు రుణాలు మంజూరు కావాలన్నా, పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా ఈ -పంట నమోదు తప్పనిసరి. ఈ విధానంతో రైతులకు ప్రభుత్వం బహుళ ప్రయోజనాలు కల్పిస్తోంది. వచ్చే నెల 15వ తేదీలోగా గడువు ఉంది.



తుమ్మపాలలో ఈ-పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు రామకృష్ణ

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఈ-పంట నమోదుతో ఎంతో మేలు జరుగుతుంది. అనకాపల్లి మండలంలో ఈ ఏడాది 10,584 మంది రైతులు 5,600 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు వేస్తున్నారు. ప్రతీ రైతు పండించే పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేసుకోవాలి. 15 రోజులుగా సాగుతున్న ఈ ప్రక్రియలో ఇంతవరకూ 40 శాతం మంది రైతులు నమోదు చేసుకున్నారు.

ఈ-పంట ప్రయోజనాలు...

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా పరిహారం పొందే వెసులుబాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తి స్థాయిలో రైతుల తరపున బీమా సొమ్ము చెల్లిస్తుంది. దీంతో పంట నష్టపోయినప్పుడు గతంతో ఈ-పంట ద్వారా నష్టపోయిన రైతు ఎంత మేరకు సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడులు అంచనాకు ఇది సరైన విధానం ఎరువులు, పురుగుల మందులు, ఎంత మేరకు అవసరం అవుతాయో ఆయా పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు తెలిసే అవకాశముంటుంది.


బ్యాంకుల్లో పంట రుణాలు...

ఈ-పంట నమోదు ప్రక్రియ ముగిసిన అనంతరం వ్యవసాయాధికారులు జారీ చేసిన ఈ- పంట ధ్రువీకరణ ద్వారా రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు పొందే అవకాశముంది. ఇప్పటివరకూ పంట రుణాలు పొందని రైతులు వ్యవసాయాధికారులు జారీ చేసే ధ్రువీకరణతో బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో రుణాలు పొందవచ్చు. గతంలో పంట రుణాలు పొందిన రైతులు ఈ-పంట నమోదు సర్టిఫికెట్లను ఆధారంగా చేసుకుని వాటిని రెన్యువల్ చేసుకునే సౌకర్యం ఉంది.

కౌలు రైతులకు పరిహారం...

సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందుతుంది. గతంలో పొలాన్ని కౌలు రైతులు కౌలకు తీసుకున్నా పంట నష్టపరిహారం మాత్రం యాజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీచేస్తే, ఈ-పంట నమోదులో సదరు పొలం కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తోంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలు రైతుల పేరు మీదే ఈ-పంట నమోదవుతుంది. పంట నష్ట పరిహారం కౌలురైతులకు నేరుగా అందుతుంది.

విపత్తుల్లో ఆదుకుంటుంది



ప్రతి పంటకు ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకే లాభం చేకూరుతుంది. రైతు, కౌలు రైతులకు మంచి జరుగుతుంది. గతేడాది ఈ- పంట నమోదు చేసుకున్నాను. ఈ ఏడాది కూడా నమోదు చేసుకుంటాను. బ్యాంకులో రుణం వస్తుంది. విపత్తుల వల్ల పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఆదుకుంటుంది.

– ఎస్. అప్పారావు, రైతు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి. కూరగాయలు, ఉద్యానవన పంటలు, మామిడి, జీడి ఇతర పంటలకు ఈ-పంట వర్తిస్తుంది. సెంటు స్థలం నుంచి ఎంత భూమిలో పంట పండించినా నమోదు చేసుకోవాలి. వ్యవసాయ శాఖ సహాయ దారులు పొలాలు వద్దకు వచ్చి నమోదు చేస్తారు.

– పి.రంగాచారి, ఏఓ, అనకాపల్లి

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ట



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

అనకాపల్లి: స్థానిక గవరపాలెంలోని దిబ్బవీధి కొబ్బరితోట వద్ద నాగేంద్ర సమేత వల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం నాగేంద్రస్వామి, కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను వేదపండితులు ప్రతిష్టించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తెల్లవారు జాము నుంచి ప్రధాన అర్చకుడు కొడుకుల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని నిర్వహించి, మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్‌కుమార్, కోశాధికారి కొణతాల త్రినాథరావు, కమిటీ సభ్యులు మద్దాల క్రాంతికుమార్, పీలా గిరి, మళ్ల జగదీష్, ఆలయ సలహాదారులు యల్లపు సత్యనారాయణ, యల్లపు గోవింద, పి.వి. జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తం

- జోనల్ మలేరియా విభాగం అధికారి శాంతిప్రభ



తుమ్మపాల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న శాంతిప్రభ

అనకాపల్లి: కురుస్తున్న వర్షాలతో ప్రజలు విషజ్వరాలు బారిన పడే అవకాశముందని, ప్రధానంగా మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జోనల్ మలేరియా విభాగం అధికారి శాంతిప్రభ తెలిపారు. తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైన జ్వరపీడితులను గుర్తించినట్లయితే తక్షణమే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. పూలకుండీలు, నీటి నిల్వలు వద్ద దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వీటిని అరికట్టాలంటే ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించడంమే కాకుండా వారి మన్ననలను పొందాలని తెలిపారు. అంతకుముందు మారేడుపూడి గ్రామాన్ని సందర్శించారు. ఆరోగ్య విస్తరణాధికారి బి.తిరుపతిరావు, తుమ్మపాల వైద్యులు సమీమ్, వాణిజగదీశ్వరీ, మలేరియా విభాగం నోడల్ అధికారి బి.సంగమ్, వైద్య సిబ్బంది ఎస్.ఈశ్వరరావు, బి.మంగమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

శారదానదిలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు



అపరిశుభ్రంగా శారదానది ఒడ్డు



శారదానది ఒడ్డున పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పీ అయ్యప్పనాయుడు

- జెడ్పీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని శారదానది ఒడ్డుతోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు జెడ్పీ వై.అయ్యప్పనాయుడు తెలిపారు. స్థానిక శారదానది ఒడ్డును వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీతో శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శారదానది ఘాట్ వద్ద వచ్చే నెల 7వ తేదీన నిర్వహించే వినాయక చవితి వేడుకల సందర్భంగా భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని నది ఒడ్డున విద్యుత్‌లైట్లు, గజ ఈతగాళ్ల వంటి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, సభ్యులు కొడుకుల శ్రీకాంత్, కె. హరినాథ్ బాబు, కె. భరత్, పి. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి జలగల మధుం జంక్షన్ సమీపంలో (డైట్ కళాశాల ఎదురుగా) జగన్నాథస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు హరేకృష్ణ సత్సంగ మందిర అధ్యక్షుడు దుర్లభ కృష్ణప్రేమదాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25న 7 గంటలకు దర్శన హారతి, గురుపూజ భగవతి ప్రవచనం, బాలబాలికలచే శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, కోలాట నృత్య ప్రదర్శన, సాయంత్రం ఉట్టి ఉత్సవము, 26న ఉదయం దర్శనహారతి, బాల గోపాలుడి ఊంజల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ లీలామృతం ప్రవచనం, రాధా గిరిధారి భగవానునికి పంచామృత, ఫలదస, మహా కలశాభిషేకం, మహా అభిషేకం, 27న శ్రీల ప్రభుపాదుల వారి ఆవిర్భావం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



గోపీజన వల్లభస్వామి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజన వల్లభస్వామి ఆలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి శోభాయాత్ర జరుగుతుందని చెప్పారు. కృష్ణాష్టమి రోజున సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామికి గోక్షీరాభిషేకం, ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సహస్ర నామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయత్రం 4.30 గంటలకు స్వామికి 108 రకాల ప్రసాదం నివేదన, 5 గంటల నుంచి ఊంజల్ సేవ, 5.30 గంటల నుంచి ఐదేళ్ల బాలబాలికలకు బాలకృష్ణ వేషధారణ పోటీలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీ సరస్వతి నృత్య మందిర్‌చే భరతనాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి జరిగే 108 రకాల ప్రసాద నివేదనలో భక్తులు పాలుపంచుకోవచ్చని, ఎవరైనా తమ ఇంటి వద్ద తయారుచేసిన ప్రసాదాన్ని తీసుకురావచ్చని తెలిపారు. భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

స్టార్టప్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్-స్టార్టప్ స్కిల్స్‌పై రిసోర్స్ పర్సన్ వసంత పట్నాయక్ అవగాహన కల్పించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంట్రప్రెన్యూర్షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్, హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కామర్స్ హెచ్‌వోడీ ఎం.గోవిందరావు, తెలుగు లెక్చరర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకురాలు బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న దేముడమ్మ

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, గొర్లివానిపాలెం గ్రామాల్లో కోళ్ల ఫారం షెడ్లు నిర్మించడానికి ఎవరికీ, ఏవిధమైన అనుమతులు ఇవ్వకుండా నిలపాలని మేజర్ పంచాయతీలో పలువురు వార్డు మెంబర్లు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయా వార్డు మెంబర్లు శనివారం పంచాయతీ కార్యదర్శి మూర్తికి వినతిపత్రం అందజేశారు. సబ్బవరం మండల కేంద్రం కావడంతో ఎప్పుడూ జనావాసాలతో నిండి ఉంటుందన్నారు. సబ్బవరంలో కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడం వల్ల వాతావరణం కలుషితమై అంటువ్యాధులు ప్రబలి, ప్రజలు రోగుల గురవుతున్నారని, ఎవరికీ అనుమతులు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వార్డు మెంబర్లు కె.దేముడమ్మ, టి.శేఖర్, ఎస్.శివ తదితరులు వినతిపత్రం అందించారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి



లంకెలపాలెం వంతెన వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం కోరారు. లంకెలపాలెం వంతెన సమీపంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసెన్సియా, సినర్జిన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 18 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్సియా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. యాజమాన్యాలకు రాయితీలు కల్పిస్తూ కార్మిక చట్టాలు అమలు చేయని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులు విధులకు రావాలంటేనే భయపడుతున్నారన్నారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికి స్థానికంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వాపోయారు. పరవాడలో రెండు వందల పడకల సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు వెంకటరావు, లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవకిశోర్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్

నర్సీపట్నం: సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్ పేర్కొన్నారు. కోర్టు సముదాయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే అపీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు, అదనపు సివిల్ జడ్జి రోహిత్ మాట్లాడారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మూడు అధ్యాపకుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ ప్రక్రియ చేడుతున్నామని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ బి. రాధ తెలిపారు. జువాలజీ, ఒకేషనల్ కోర్సులలో కంప్యూటర్ సైన్స్, జీఎఫ్‌సీ పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28న స్థానిక కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు. జువాలజీ పోస్టుకు దరఖాస్తులు చేసే వారు ఎంఎస్సీ జువాలజీలో యాభై శాతం మార్కులతోను, కంప్యూటర్ సైన్స్‌కు పోస్టుకు బీటెక్ కంప్యూటర్స్‌లో యాభై శాతం మార్కులతోను, జీఎఫ్‌సీ పోస్టుకు ఎంఏ ఎకనామిక్స్(రూరల్ డెవలెప్‌మెంట్)లో యాభై మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికయ్యే అధ్యాపకులకు నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని స్థానిక ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

దేవరాపల్లి : తెనుగుపూడి డా. బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సీట్లలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ తెలిపారు. 5వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 13 సీట్లు, 9వ తరగతిలో 5 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 10 సీట్లు, ఫస్టియర్ బైపీసీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సీట్లు కావాల్సిన వారు ఈ నెల 31లోగా విద్యాలయం పని చేసే వేళల్లో దరఖాస్తుతో పాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులతో నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ కోరారు.

సింహగిరిపై సెల్‌ఫోన్ కౌంటర్‌లో అక్రమ వసూళ్లు

- ఏఈవో ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన వైనం

సింహాచలం: సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం శనివారం ఆకస్మికంగా దేవస్థానం ఏఈవో చేసిన తనిఖీల్లో బయటపడింది. వివరాలిలోకి వెళ్తే.. భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కాంట్రాక్ట్‌ను చేయలేక కాంట్రాక్టర్ ఇటీవల విరమించుకున్నాడు. దాంతో దేవస్థానమే స్వయంగా తమ సిబ్బందిని కౌంటర్లలో నియమించి సెల్‌ఫోన్ భద్రపరిచే ఏర్పాటు చేసింది. కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కి రూ.5 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ తరుణంలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం ఇటీవల చర్చాంశనీయమైంది. దీంతో శనివారం దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జారీ చేసిన టికెట్లు కంటే రూ.960 నగదు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రిపోర్టు తయారుచేసి దేవస్థానం ఈవో దృష్టికి తీసుకెళ్లారు.